రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ, 8గంటలకు గోపూజ, యాగశాల అర్చన, పరివార దేవతారాధన, విజయ గణపతికి విశేష సహస్ర మోదుగులతో హోమం, నిత్య పూర్ణాహుతి, దేవతామూర్తులకు పంచామృత అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా సాయంత్రం 5.30 గంటలకు శ్రీలలితా సహస్రనామ పారాయణం, యాగశాల ప్రవేశం, ఏకాదశ రుద్రాలతో రుద్రహోమం, శ్రీకామాక్షిదేవి మూలమంత్ర బీజాక్షరి హోమం నిర్వహించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మల్లంపేట్‌లోని కేవీఆర్ లేఅవుట్‌లో జేసీబీతో దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం

దుండిగల్: అక్రమ నిర్మాణాలపై దుండిగల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. బుధవారం మల్లంపేట్ పరిధిలోని కేవీఆర్ లేఅవుట్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన మూడు దుకాణాలను టీపీఓ సంజన ఆదేశాల మేరకు జేసీబీతో కూల్చివేశారు. మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని ఆమె హెచ్చరించారు.

మర్యాదపూర్వక కలయిక



మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని కలిసిన కుత్బుల్లాపూర్ నాయకులు

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని బుధవారం కుత్బుల్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు జెస్సీపాల్ నేతృత్వంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించిన నాయకులు మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమాలు నాయకులు రాధాకృష్ణ, ఆనందరావు, పాషా, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

డంపింగ్‌యార్డ్‌గా మారింది!



బహదూర్‌పల్లిలోని ఆయుష్ వనం వద్ద ప్రధాన రోడ్డు పక్కన పారబోసిన చెత్త

సుభాష్‌నగర్: బహదురుపల్లి-కొంపల్లి ప్రధాన రోడ్డులో బహుదూర్‌పల్లి ఆయుష్ వనం పార్కు వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకపోవడంతో దుర్గంధం నెలకొంది. స్థానికంగా కొంతమంది చెత్త ఎక్కడపడితే అక్కడ వేయడంతో డంపింగ్‌యార్డ్‌గా మారింది. ఒకప్పుడు రోడ్డుకు ఇరువైపులా అటవీ ప్రాంతం ఉండటం వలన ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ప్రస్తుతం కొంతమంది విచ్చలవిడిగా చెత్త పారేయడంతో నాటి ఆహ్లాదం కనుమరుగైంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశ్రమలో సెక్యూరిటీగార్డు మృతి

జీడిమెట్ల: గుర్తు తెలియని కారణంతో ఓ సెక్యూరిటీ గార్డు పరిశ్రమలో మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అంజనేయులు వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన కె.శంకర్(50) జీడిమెట్ల ఫేజ్-5లోని ఏసీఎంఐ అల్యూమినియం పరిశ్రమలో గత సంవత్సరం కాలంగా సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఎప్పటిలాగే శంకర్ డ్యూటీకి వచ్చాడు. బుధవారం ఉదయం పరిశ్రమకు వచ్చిన రాము అనే కార్మికుడు గేటు మూసి ఉండటంతో సెక్యూరిటీ అని పిలిచాడు. ఎంత పిలిచినా గేటు తీయకపోవడంతో గేటు పైకెక్కి వెళ్లి పిలిచాడు. ఉలుకు పలుకు లేకపోవడంతో దగ్గరికి వెళ్లి చూడగా మృతిచెందాడని గమనించాడు. ఏదైనా అనారోగ్యం కారణంగా శంకర్ మృతి చెందాడా లేక మరేమైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుంటుంబానికి మానవతా దృక్పథంతో పరిశ్రమ యాజమాన్యం ఆర్థికంగా ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

తప్పుడు పత్రాలతో అప్పు.. చెల్లించని వ్యక్తికి జైలు

జగద్గిరిగుట్ట: తప్పుడు ఇంటి పత్రాలతో అప్పు తీసుకుని.. తిరిగి ఇవ్వకపోగా అప్పు ఇచ్చిన వ్యక్తిపై బెదిరింపులకు పాల్పడిన వ్యక్తికి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కేడవెంది గ్రామానికి చెందిన పెద్ది రవి(36), పెద్ది సునీత (30)లు గాజుల రామారం చంద్రగిరినగర్‌కు చెందిన లత అనే మహిళ వద్ద 2012, మే 10వ తేదీన రూ.10లక్షలు అప్పు తీసుకున్నారు. అప్పు తీసుకునే సమయంలో కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లోని ప్లాట్ డాక్యూమెంట్లను లతకు పూచీకత్తుగా ఇచ్చారు. అయితే సదరు డాక్యూమెంట్లను పరిశీలించగా నకిలీవని తేలడంతో బాధితురాలు లత తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని రవి దంపతులను కోరింది. అయితే రవి, సునీతలు తమ బంధువులు సత్యనారాయణ, రమేష్‌రావు, శ్రీరాములయ్య, రంగ యాదగిరిలతో కలిసి 2014 డిసెంబరు 24న బెదిరింపులకు దిగడంతో పాటు డబ్బులు ఇక ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. దీంతో మోసపోయాయని గ్రహించిన లత పోలీసులను ఆశ్రయించగా చీటింగ్ కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన కూకట్‌పల్లి అడిషనల్ మెట్రోపాలిటన్ జడ్జి బుధవారం తుది తీర్పును వెల్లడించారు. నిందితుడు పెద్ద రవికి రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ గూటికి బొడ్డు వెంకటేశ్వరరావు

- కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- రోజురోజుకు కుత్బుల్లాపూర్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి నచ్చి చెప్పినా కాంగ్రెస్‌కే జైకొట్టిన వెంకటేశ్వరరావు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల వేళ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండగా తాజాగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరులుగా ఉన్న మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, బొడ్డు రవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

- ఇటీవల నిజాంపేట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేగా.. అదే తరహాలో బీజేపీకి చెందిన పలువురి చేరికలు జరిగాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల వేళ రాజకీయ పరిణామాలు రోజురోజుకు మారుతూ వస్తున్నాయి.
- గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన బొడ్డు వెంకటేశ్వరరావు అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే వివేకానందకు అత్యంత సన్నిహితంగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం రాత్రి వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి ఎంత నచ్చి చెప్పినా బుధవారం ఉదయం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత దగ్గరగా ఉండే ఈయనకు ప్రభుత్వంలో నామినేటెడ్ పదవి ఇచ్చే విషయంపై క్లారిటీ వచ్చిన తర్వాతనే పార్టీలో చేరినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ రాజకీయ సమీకరణలు జోరందుకునే అవకాశాలు ఉన్నాయి.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు

కాంగ్రెస్‌లో చేరికలు..

- మాజీ కౌన్సిలర్లు ఈఈ సాగర్‌రావు, బోబ్బా రంగారావు, గణేష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, సెక్రటరీ మురళీగౌడ్ తదితరులు సీఎం సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

బిల్లులు కట్టని వారికి నోటీసులు పంపించాలి



సమావేశంలో రెవెన్యూ వసూళ్లపై దిశానిర్దేశం చేస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేసి టార్గెట్ పూర్తి చేయాలని వాటర్ వర్క్స్ సీజీఎం, కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ రాబడి విషయంలో బుధవారం షాపూర్‌నగర్‌లోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. మొండిబకాయలు లేకుండా ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి వసూళ్లను రాబట్టాలన్నారు. అధిక శాతం పెండింగ్ ఉన్న బిల్లులపై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ రాబడే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బిల్లులు కట్టని వారికి నోటీసులు పంపించాలని సూచించారు. నోటీసులు పంపించినా పట్టించుకోని వారి కనెక్షన్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీఎం అప్పలనాయుడు, మేనేజర్లు రోహిణి, రమ్య భారతి, అనూష, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా శ్రీరామచంద్రనగర్‌లో నూతనంగా పైపు లైన్ల పనులు చేపట్టాలని సంక్షేమ సంఘం నేతలు సీజీఎం శ్రీధర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

భారీ వాహనాలకు నో ఎంట్రీ!



అల్వాల్ ట్రాఫిక్ సీఐ శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: నో ఎంట్రీ సమయాల్లో భారీ వాహనాలు రోడ్డుపైకి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అల్వాల్ ట్రాఫిక్ ఎస్సై శ్యామ్‌బాబు అన్నారు. జీడిమెట్ల సమీపంలోని హోమ్‌బుక్స్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టి నంబర్ ప్లేట్లులేని వాహనాలు, నో ఎంట్రీ సమయాల్లో తిరుగుతున్న వాహనాలు, చలానా నుంచి తప్పించుకుంటూ తిరుగుతున్న వాటిని గుర్తించి కేసులు నమోదు చేశారు.

ఈ సమయంలో రాకపోకలు నిషిద్ధం..

- ఉదయం 7.30 నుంచి 11.30 వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10.30గంటల వరకు భారీ వాహనాలు రాకపోకలు మేడ్చల్ నుంచి సుచిత్ర వరకు నిషేధం ఉందన్నారు. 11.30 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు మాత్రమే భారీ వాహనాలకు ప్రవేశముందని తెలిపారు. ఇతర సమయాల్లో వస్తే మాత్రం తప్పకుండా వాటిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని శ్యామ్‌బాబు స్పష్టం చేశారు.

ప్రతిరోజు తనిఖీలు..

- ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో తనిఖీలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు మీదుగా భారీ వాహనాలు వెళ్తున్న విషయంపై ఫిర్యాదులు రావడంతో అక్కడ కూడా తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు



రామారం చెరువు అలుగు వద్ద నిర్మాణం..



వడ్లవారి కుంటను పూడ్చి వేసి నిర్మాణం..

- ఎన్నికల విధుల్లో అధికారులు
- రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు

సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు బిజీగా ఉంటే.. ఇదే అదునుగా సర్వే నంబర్.77లో కబ్జారాయిల్లు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళలో గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి కోట్లు విలువ చేస్తే స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడను ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 77 వడ్ల వారి కుంటను పూడ్చివేసి ఎంచక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే పది గదులు నిర్మించగా, తాజాగా మూడు రోజుల వ్యవధిలో మూడు గదులను రాత్రికి రాత్రి నిర్మించారు. గతంలో ఈ గదులను రెవెన్యూ సిబ్బంది కూల్చివేయగా మరల నిర్మాణం చేపట్టారు. పక్కనే ఆనుకొని ఉన్న గాజులరామారం పెద్ద చెరువు అలుగు వద్ద మరో మూడు గదులను నిర్మించారు. గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపట్టగా «సాక్షి»వెలుగులోకి తీసుకురావడంతో అప్పట్లో అధికారులు కూల్చివేశారు. ప్రస్తుతం అధికారులు ఎన్నికల బిజీగా ఉండగా దొరికిందే చాన్స్ అంటూ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటినుంచి హెచ్‌సీయూలో ఐఎస్ఎల్ఈ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో 64వ వార్షిక ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్ఎల్ఈ) సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు పేపర్ ప్రజెంటేషన్‌లు, ఆరు ప్యానెలిస్ట్ లెక్చర్‌లు, మూడు థీమ్‌ల చుట్టూ పదహారు సమాంతర ప్యానెల్ చర్చలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తారు.ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి 1200 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు. అందులో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి రంగరాజన్ ప్రారంభోపన్యాసంతో సదస్సును ప్రారంభిస్తారు. ఐఎల్ఏస్ఈకి చెందిన ప్రొఫెసర్ మైత్రీష్ ఘటక్, జేఎన్‌యూ ప్రొఫెసర్ దీపక్ నయ్యర్, ఐఎల్ఓలోని సీనియర్ ఎకనామిస్ట్ ఉమారాణి, ఉపేంద్రబాక్సీ, లార్డ్ మేఘనాద్ దేశాయ్ వంటి ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు పాల్గొంటారు.

వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు

నిజాంపేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 22వ డివిజన్ నాయకుడు మేడా శ్రీనివాస్, 3వ డివిజన్ నాయకురాలు షేక్ రఫియా ఆధ్వర్యంలో లోకనాథ్, శాంతి స్వరూప్, రాము, వేణుమాదవ్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు పరిచిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా..



ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులో సంజయ్‌గాంధీనగర్ వద్ద గోడపై ఇలా..



జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్-బి బ్లాక్‌లో ఓ రోడ్డులో గోడకు పోస్టర్లు..

గోడలపై పార్టీల ప్రకటనలు తొలగించని వైనం

రంగారెడ్డినగర్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రెండు వారాలు కావస్తున్నా ఇంకా కోడ్ ఉల్లంఘనలు కనిపిస్తూనే ఉన్నాయి. ప్రధాన రహదారుల వెంబడి ఆయా పార్టీలకు చెందిన ప్రకటనలు గోడలపై అలానే కనిపిస్తున్నాయి.. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజకీయ పార్టీలకు చెందిన పోస్టర్లు, గోడ రాతలను వెంటనే చెరిపివేయాల్సిందిగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అయితే ప్రధాన చౌరస్తాలు, ప్రధాన రోడ్ల వెంబడి పోస్టర్లు, గోడరాతలను తొలగించిన సిబ్బంది కొన్ని ప్రాంతాలను వదిలేశారు. దీంతో అక్కడ రాజకీయ పార్టీలకు చెందిన పోస్టర్లు ఇంకా దర్శనమిస్తున్నాయి..



ఫ్లాగ్‌మార్చ్

సుభాష్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

జీడిమెట్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జీడిమెట్ల పోలీసులు కేంద్ర, సాయుధ బలగాలతో కలిసి సుభాష్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బుధవారం సాయంత్రం పోలీసులు జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు అద్వర్యంలో వీధుల్లో కవాతు నిర్వహించారు. ప్రజలు ఎలాంటి ఒత్తిడి, ప్రలోభాలు లేకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుని స్వేచ్ఛగా ఓటు వేయాలని శ్రీనివాసరావు అన్నారు. కవాతులో ఎస్సై నాయుడుతో పాటు కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

దక్షిణ ఆసియాలోనే 'ఎస్కీ' కీలకం

రాయదుర్గం: దక్షిణ ఆసియాలోనే ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు మంచి గుర్తింపు ఉందని ఎస్కీ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎం చౌడేగౌడ పేర్కొన్నారు. 2024–25 సంవత్సరం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాల వార్షిక కేలండర్‌ను బుధవారం ఆయన డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీలో 12 శాఖలు ఉన్నాయన్నారు. గత ఏడాది సుమారు ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ పురోగతిలో సాధికారత, ప్రపంచంలోని సవాళ్ళను పరిష్కరించడానికి అభ్యర్థులను సన్నద్ధం చేయడం, నిరంతరం అభివృద్ధి చెందుతున్న అధునాతన ఇంజనీరింగ్, సాంకేతిక రంగాల్లో శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఎస్కీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు కార్యక్రమంలో కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.